క్లుప్తంగా

వాడవాడలా అన్నసమారాధనలు



51వ వార్డులో అన్నప్రసాదం వడ్డిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మద్రిపాలెం: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం 51వ వార్డులో పలు చోట్ల అన్నసమారాధనలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు, కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ఈ కార్యక్రమాలను ప్రారంభించారు. భీం నగర్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులు తాటిపూడి రత్న, రమేష్, ఇతర కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో, గాంధీనగర్ -1లో కమిటీ సభ్యులు, యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానంలో కార్పొరేటర్ భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. తాటిపూడి వెంకట్, చైతన్య, వైఎస్సార్‌సీపీ నాయకులు మెట్ట దమయంతి, పైడిరాజు, గాంధీనగర్ కాలనీవాసులు, యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



తెలుగు భాషా దినోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్న చిన్నారులతో పాఠశాల సిబ్బంది

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెంలోని విశ్వతేజ స్కూల్‌లో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తెలుగు వ్యవహారిక భాషా పితామహులు గిడుగు వెంకట రామమూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ ఐ.భాస్కరరావు మాట్లాడుతూ తెలుగు భాష ప్రాముఖ్యత, విశిష్టతల గురించి తెలిపారు. తెలుగు భాష విశేషతలను తెలియజేస్తూ విద్యార్థులు ప్రదర్శించిన స్కిట్లు, శాస్త్రీయ నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఐ.సునీత, ఇన్‌చార్జి కె.ఇందిర, తెలుగు ఉపాధ్యాయులు ఎస్.విజయకుమారి, ఇ.సరణ, టి.వరలక్ష్మి పాల్గొన్నారు.

నేడు వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

రైల్వేస్టేషన్‌లో 8 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న నిందితుడిని శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా.. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయ నాయుడు ఆధ్వర్యంలో ఎస్‌ఐ ఎస్.రామారావు, ఆర్పీఎఫ్ ఎస్‌ఐ వి.కీర్తిరెడ్డి తమ సిబ్బందితో కలిసి రైల్వే స్టేషన్‌లోని వివిధ ప్లాట్‌ఫారాల్లో తనిఖీలు చేశారు. ఒడిశా గంజాం జిల్లాకు చెందిన ఓం ప్రసాద పాండి విశాఖ స్టేషన్ మీదుగా గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి రూ.40 వేల విలువైన 8 కిలోల గంజాయిని సీజ్ చేసి నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

జర్నలిస్టుల పిల్లలకు విద్యా ప్రోత్సాహకాలు



విద్యా ప్రోత్సాహకాలు అందిస్తున్న గంట్ల శ్రీనుబాబు

సీతంపేట: జర్నలిస్టుల పిల్లల విద్యకు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు విద్యా ప్రోత్సాహకాలు అందజేశారు. అక్కయ్యపాలెంలోని తన కార్యాలయంలో శుక్రవారం ముగ్గురు జర్నలిస్టుల పిల్లలకు రూ.40 వేలు విరాళంగా అందించారు. బీటెక్ చదువుతున్న పిల్లా సిద్ధార్థకు రూ.10 వేలు, ఇంటర్ విద్యార్థి జాన్ అలెక్స్‌కు రూ.10 వేలు, మరో బీటెక్ విద్యార్థికి రూ.20 వేలు అందజేశారు. జర్నలిస్టుల పిల్లల్లో ప్రతిభకు కొదువ లేదని, వారిని ప్రోత్సహించడం తన అభిమతమని శ్రీనుబాబు తెలిపారు.



51వ వార్డు అప్పయ్యనగర్ గెడ్డలో సన్నగా ప్రవహిస్తున్న మురుగు, చుట్టూ వ్యర్థాలు

పారిశుధ్యం.. అధ్వానం

- అప్పయ్యనగర్ గెడ్డ పూడికలమయం
- వానొస్తే దుర్గంధం, దోమల భయం
- కానరాని వ్యర్థాల తొలగింపు చర్యలు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు



మాధవధార వుడా కాలనీలో నిలిచిన వర్షపు నీరు

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డులో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. ఇక్కడి అప్పయ్యనగర్ కాలనీలోని గెడ్డలో పూడిక పేరుకుపోయింది. దీనిని ఆనుకుని నివసిస్తున్న ప్రజలు అవస్థలు పడుతున్నారు. వర్షా కాలం కావడంతో వాన కురిసే సమయంలో దుర్గంధంతోపాటు దోమల బెడదతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని నివాసులు చెబుతున్నారు. చుట్టుపక్కల నివసించే వారు ఇళ్లలో చెత్తను తీసుకువచ్చి గెడ్డలో వడేస్తున్నారు. దీంతో దోమలు, క్రిమికీటకాలు, విష పురుగులు, ఎలుకలు ఇళ్లల్లోకి వచ్చేయడంతో అనారోగ్యాల బారిన పడుతున్నారు. భవన నిర్మాణ వ్యర్థాలను కూడా రోడ్లపై ఎక్కడిక్కడ వేయడంతో అవి ఇరుగ్గా మారుతున్నాయి. దీంతో వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. డెబ్రిస్ డంపింగ్ వల్ల రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి.



గెడ్డను ఆనుకుని పేరుకుపోయిన పూడిక

వర్షపు నీటిలో దోమల వృద్ధి

వార్డులోని పలు చోట్ల వర్షం పడితే నీరు నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మాధవధార వుడా కాలనీలోని వాటర్ ట్యాంక్ సమీపంలో రోడ్డు మీద వర్షపు నీరు నిలిచిపోయింది. అక్కడే వాహనాలు పార్క్‌చేయడంతో బురద మయంగా మారింది. రోడ్డు అంచున వాహనాలు నిలపడం వల్ల పాములు, పురుగులు వాటి కిందకి చేరి ఉంటున్నాయి. ఏమరుపాటుగా ఉంటే వాటి దాడికి గురికాక తప్పదు. వర్షపు నీరు నిలిచిపోవడంతోపాటు పిచ్చి మొక్కలు, వ్యర్థాలు ఈ ప్రాంతంలో ఉండటం వల్ల అటుగా వెళ్లేవారు దోమల కాటుకు గురవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి వార్డులో శుభ్రత చర్యలు చేపట్టి ఎప్పటికప్పుడు వ్యర్థాలు తొలగించాలని, దోమలు వృద్ధి చెందకుండా ఫాగింగ్ చేపట్టాలని కోరుతున్నారు.

నిలిచిపోతున్న వ్యర్థాలు

ఈ గెడ్డ వార్డులో ప్రధానమైనది కావడంతో ఎగువ నుంచి వస్తున్న చెత్త, వ్యర్థాలు అప్పయ్యనగర్‌లో నిలిచిపోతున్నాయి. ఇలా పేరుకుపోయిన చెత్త వల్ల దోమలు విజృంభిస్తున్నాయని, రాత్రి వేళ చీకటి పడ్డాక దాడులు చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. దోమలు వ్యాపించడం వల్ల మలేరియా, డెంగ్యూ సోకి రోగాల బారిన పడుతున్న పరిస్థితి ఏర్పడుతోందంటున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు దామ కాటుకు గురవుతున్నారని, ఎప్పటికప్పుడు గెడ్డలో చెత్తను తొలగిస్తే ఈ పరిస్థితి ఉండదని సూచిస్తున్నారు.

లక్ష్మీగణపతిగా దుర్గాగణపతి



సీతంపేట ఆలయంలో లక్ష్మీగణపతి అలంకరణలో దుర్గాగణపతి



దుర్గాగణపతికి మహా అభిషేకం చేస్తున్న అర్చకుడు



మధురానగర్‌లో విద్యా గణపతిగా విజయ గణపతి

సీతంపేట: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సీతంపేట కూడలిలో కొలువైన దుర్గాగణపతి మూడో రోజు శుక్రవారం లక్ష్మీ గణపతి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు స్వామిని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమం భక్తులను అలరించింది. శనివారం విష్ణు గణపతి అలంకారంలో స్వామి దర్శన మిస్తారని ఈవో రమాభాయి తెలిపారు. కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, ఉత్సవ సేవా కమిటీ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మహా అభిషేకం..

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ ఉదయం ఆలయంలో పండితులు గణపతి హోమం నిర్వహిస్తున్నారు. దుర్గాగణపతికి మహా అభిషేకం, పంచామృతాలు, పండ్ల రసాలు, కొబ్బరి నీరు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం జరిపారు. అనంతరం స్వామివారిని పూలమాలలు, ఆభరణాలతో అలంకరించి సహస్రనామార్చన చేసి నీరాజనం సమర్పించారు.

విద్యా గణపతిగా విజయ గణపతి

శంకరమఠం రోడ్ మధురానగర్‌లో కొలువైన విజయ గణపతి ఆలయంలో మూడో రోజు శుక్రవారం విద్యా గణపతి అలంకారంలో స్వామి దర్శనమిచ్చారు. స్థానిక భక్తులు స్వామిని దర్శించుకుని అభిషేకం, అర్చనలు చేశారు.

హైస్కూల్‌లో ఏఐ ల్యాబ్ ప్రారంభం



మాధవధార హైస్కూల్‌లో ఏఐ ల్యాబ్ ప్రారంభాన్ని తిలకిస్తున్న విద్యార్థులు

మురళీనగర్: విద్యార్థులకు అభ్యసనలో నూతన ఆవిష్కరణలను ఉద్దేశించి ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్(ఏఐ) ల్యాబ్‌ను శుక్రవారం మాధవధార జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. సియాంట్ ఫౌండేషన్ జిల్లాలోని 50 హైస్కూళ్లలో ఈ ల్యాబ్‌లను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా మాధవధార పాఠశాలలో 5 కంప్యూటర్లు, ప్రొజెక్టర్ ఏర్పాటు చేశారు. చంద్రంపాలెం ఉన్నత పాఠశాల నుంచి ఈ ల్యాబ్‌ను రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ వర్చువల్‌గా ప్రారంభించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాసరావు పర్యవేక్షణలో విద్యార్థులు ల్యాబ్ ప్రారంభోత్సవంలో పాల్గొని దీని ప్రయోజనాలు తెలుసుకున్నారు. ఇక్కడ స్క్రీన్ బిగించకపోవడంతో తాత్కాలికంగా క్యాన్ ప్రొజెక్టర్ ద్వారా కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఈ ల్యాబ్‌ల్లో ఫ్యాన్‌లు, వైఫై, ప్రొజెక్టర్ వైట్ స్క్రీన్‌లు, భద్రతకు అవసరమైన కిటికీలు, సరైన తలుపులు వంటి సదుపాయాలు కల్పించకుండానే ప్రారంభించడం గమనార్హం.

బూత్ స్థాయిలో పార్టీ బలోపేతమే లక్ష్యం



పార్టీ ముఖ్య నాయకులు, కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులతో మాట్లాడుతున్న కె.కె.రాజు

- ప్రతి ఇంటికీ 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ'ని తీసుకెళ్లండి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు
- 'ఉత్తర' కార్పొరేటర్లు, పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం

సాక్షి, విశాఖపట్నం: బూత్ స్థాయిలోనే వైఎస్సార్ సీపీని బలోపేతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు అన్నారు. ఉత్తర నియోజకవర్గ కార్పొరేటర్లు, పార్టీ ముఖ్య నాయకులు, రాష్ట్ర, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, వార్డు అధ్యక్షులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, సీనియర్ నాయకుల సమన్వయంతో కలిసి త్వరితగతిన వార్డు స్థాయి కమిటీల నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. ప్రతిపక్షంలోనే ప్రజా సమస్యలపై పోరాడినప్పుడే నిజమైన నాయకుడిగా ప్రజలు గుర్తిస్తారన్నారు. గత ఎన్నికల ముందు టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు కూటమిగా ఏర్పడి అనేక మోసపూరిత హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక ఒకటి రెండు హామీలను తూతూ మంత్రంగా అమలు చేసి మొత్తం చేసేశామని చెప్పుకుంటోందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసగిస్తున్న తీరును ఎండగడుతూ వార్డు స్థాయిలో ప్రతి ఇంటికీ వెళ్లి 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. కూటమి ప్రభుత్వ తీరును నిరసిస్తూ ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాడిన కారణంగానే తల్లికి వందనం, ఉచిత బస్సు సౌకర్యం లాంటి పథకాలను అమలు చేశారన్నారు. పథకాలన్నీ పూర్తి స్థాయిలో అమలు చేసే వరకూ కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేలా పోరాడాలని కె.కె.రాజు పిలుపునిచ్చారు.

సమావేశంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కె.సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ మెంబర్ సాడి పద్మారెడ్డి, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, వావిలపల్లి ప్రసాద్, బర్కత్ అలీ, శశికళ, సేనాపతి అప్పారావు, మాజీ కార్పొరేటర్లు జి.వి.రమణి, పామోటి బాబ్జి, వార్డు అధ్యక్షులు గుజ్జు వెంకటరెడ్డి, పైడి రమణి, నీలి రవి, దుప్పలపూడి శ్రీనివాసరావు, బల్లా శ్రీనివాసరావు, గుడ్ల అశోక్ రెడ్డి, బొడ్డేటి కిరణ్, బీశెట్టి ప్రసాద్, బలిరెడ్డి గోవింద్, సుకుమార్, ఐ.రవికుమార్, వేణు, మాజీ డైరెక్టర్లు పైడి శ్రీను, దిడ్డి రమేష్, నూకరాజు, ప్రసాద్, మధు, సీనియర్ నాయకులు బగాతి విజయ్, పైడి ప్రతాప్, కర్రి రామారెడ్డి, జక్కపూడి సత్యనారాయణ, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, మురళీకృష్ణ రెడ్డి, బోగవల్లి గోవింద్, సదరం జ్ఞానేశ్, తిరుమలరావు, పద్మశేఖర్, గంగామహేష్, సతీష్, అప్పారావు మాస్టర్, సానబోయిన సురేష్, బద్రి, నీలాపు ఈశ్వర్, కృపా, పాల్, పారుపల్లి రవి, రాఘవులు, కొట్యాడ సూర్య, గోపి, రామలక్ష్మి, మువ్వల సంతోష్, సారిపల్లి సంతోష్, అనిల్, వి.వరలక్ష్మి, సొండి సురేష్, బాధ శ్రీనివాస్, బిలాల్, లక్ష్మణరావు, సురేష్, శ్రీరామ్, కనకరాజు, శివప్రసాద్, గణేష్, జగదీశ్, రాధాకృష్ణ, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

మహానుభావుడు గిడుగు రామమూర్తి పంతులు



పాఠశాలలో గేయ పద్యం ఆలపిస్తున్న ప్రజా గాయకుడు దేవిశ్రీ

సీతంపేట: గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా శుక్రవారం అక్కయ్యపాలెం ఎన్‌జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. గిడుగు చిత్రపటానికి పాఠశాల హెచ్‌ఎం జయంతి రాధాకుమారి, తెలుగు ఉపాధ్యాయుడు ఎం.ఎన్.వి.విశ్వనాథం పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు పద్యాలు రాయడం, వివిధ కవుల చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. కె.రిషిత, ధనలక్ష్మి, చాందిని విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా ప్రజా గాయకుడు మజ్జి దేవిశ్రీ తెలుగు భాష గొప్పతనాన్ని తనదైన శైలిలో గేయ పద్య రూపంలో ఆలపించి అలరించారు. విశ్వనాథం మాట్లాడుతూ తెలుగు భాష కోసం జీవితాన్ని అంకితం చేసిన మహానుభావుడు గిడుగు రామ్మూర్తి పంతులని, దానికి గుర్తుగా ప్రతి ఏటా ఆయన జయంతిని తెలుగు భాషా దినోత్సవం జరుపుకుంటామని తెలిపారు.



మాతృభాషా దినోత్సవంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాసరావు

తెలుగును కాపాడుకుందాం

మురళీనగర్: తేట తేనెలొలుకు తెలుగు భాషను బతికించుకుందామని మాధవధార హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం పి.శ్రీనివాసరావు అన్నారు. మాతృభాషా దినోత్సవం సందర్భంగా శుక్రవారం మాధవధార జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో తెలుగు వెలుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర భాషా మోజులో పడి.. పుట్టి పెరిగి మాటలు నేర్పిన తెలుగును మర్చిపోతున్నామన్నారు. మాతృ భాష అంతరించిపోతే తెలుగువారి మనుగడ సాధ్యం కాదన్నారు. దీన్ని కాపాడుకోవాల్సి బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ఈ సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ముందుగా వ్యవహారిక భాషా వేత్త గిడుగు రామ్మూర్తి పంతులు, మూడు ఒలింపిక్ బంగారు పతకాలు సాధించిన హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలుగు ఉపాధ్యాయులు గొర్లె దేముడు, బి.అనురాధ, పీడీఆర్ బాలరాజు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరాయ.. విభిన్న రూపాయ

ఘనంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు

సీతంపేట: నియోజకవర్గంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వినూత్నమైన మండపాలు, విభిన్న రూపాల్లో గణపతి విగ్రహాలను ప్రతిష్టించి విశేష పూజలతో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లో శివరామ స్వీట్‌షాప్ పక్కన సునీల్ యూత్ శివుడి రూపంలో ఏర్పాటు చేసిన మండపం, దాని ముందు నందీశ్వరుడు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. లలితానగర్‌లో జ్ఞాననికేతన్ స్కూల్ వద్ద గుహ ఆకారంలో ఏర్పాటు చేసిన మండపం, సీతంపేటలో గడ్డితో నిర్మించిన పర్ణశాల మండపం, శంకరమఠం రోడ్‌లో క్రౌన్ బేకరీ వద్ద ఆర్‌బీ యూత్ ఏర్పాటు చేసిన 20 అడుగుల శ్రీకృష్ణ రూప గణపతి, సీతంపేటలో ఐపీఎల్ చాంపియన్ ఆర్‌సీబీ టీమ్, ట్రోఫీ పట్టుకున్న విరాట్ కోహ్లి రూపంలో వినాయకుడు భక్తులకు ఆకట్టుకుంటున్నాయి.



అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డులో ఆకట్టుకుంటున్న వినాయక మండపం



సీతంపేటలో గడ్డితో ఏర్పాటు చేసిన పర్ణశాల



శంకరమఠం రోడ్డులో 20 అడుగుల శ్రీకృష్ణ గణపతి



సీతంపేటలో ఐపీఎల్ కప్ పట్టుకున్న విరాట్ కోహ్లి రూపంలో వినాయకుడు



లలితానగర్‌లో గుహలా నిర్మించిన మండపం

విశిష్ట సేవకులకు అవార్డుల ప్రదానం రేపు

సీతంపేట: ప్రతిభ కళా క్రీడా సాంస్కృతిక సంస్థ 25వ వార్షికోత్సవం ఈ నెల 31న ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించనున్నట్టు సంస్థ ప్రతినిధులు వర్రే నాంచారయ్య, ప్రతిభ అడవిరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన కళాకారులు, ప్రముఖులకు అవార్డులు ప్రదానం చేయనున్నట్టు తెలిపారు. నిష్ణాతులైన గురువులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ గురుశ్రేష్ఠ అవార్డు, బి.ఆర్.అంబేడ్కర్ సేవారత్న, మదర్ థెరిసా సేవా రత్న, అబ్దుల్ కలాం సేవా రత్న వంటి అవార్డులు అందజేస్తామన్నారు. కళాకారులు, ప్రముఖులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఆధ్యాత్మిక చింతనతో ఆనందకర జీవితం



లక్ష్మీగణేష్ ఆలయ పూజల్లో పాల్గొన్న పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెం జాతీయ రహదారి పక్కన గల శ్రీ లక్ష్మీగణేష్ ఆలయంలో నిర్వహిస్తున్న వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలకు నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి శుక్రవారం ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో ఆనందకరంగా జీవించాలని సూచించారు. పూజా కార్యక్రమాల్లో ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్, అర్చకులు బాలానంద శివాచార్య స్వామి, శ్రీ గురుపాద సేవా సమితి సభ్యులు ఎం.వి.రమణమూర్తి, పి.వేణుగోపాల్, డి.ఎస్.వర్మ, రమణమూర్తి, మహిళా సేవకులు, భక్తులు పాల్గొన్నారు.


సౌండ్ సిస్టంలకైనా అనుమతులిప్పించండి



మంత్రి లోకేష్‌కు వినతిపత్రం అందిస్తున్న దువ్వి కాళీప్రసాద్

తాటిచెట్లపాలెం: పండగల వేళ కనీసం సౌండ్ సిస్టంలకైనా అనుమతులిప్పించాలని కోరుతూ శుక్రవారం రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌కు ఉత్తరాంధ్ర ఈవెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు వినతి పత్రం సమర్పించారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ దువ్వి కాళీప్రసాద్ మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా నిర్వహించే ఊరేగింపులో సౌండ్ సిస్టం, డీజేలను వినియోగించరాదని కమిషనర్ నిబంధనలు విధించడం దారుణమన్నారు. ఈ విషయమై ఎమ్మెల్యేలందరినీ కలిశామని, ఇంత వరకు స్పందన లేదని తెలిపారు. కొన్ని వందల మంది ఈ వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నారని, వారిని ఆదుకోవాలని కోరారు. అసోసియేషన్ ప్రతినిధులు దాడి శ్రీను, భాస్కర్‌రావు, చిన్నారావు, నర్సింగ్, కనక, లోకేష్, శ్రీను, రమేష్, అప్పలనాయుడు, నూకరాజు, ఎర్నిబాబు, అన్ని యూనియన్ల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

మర్రిచెట్టు బెరడులో వినాయక రూపం



జీవీఎంసీ 55వ వార్డు కంచరపాలెం తిక్కవానిపాలెం పైడిమాంబ ఆలయం వద్ద మర్రిచెట్టు బెరడుల్లో వినాయకుడి అవతారం కనిపించడంతో శుక్రవారం స్థానికులు పసుపు కుంకుమలతో పూజలు చేశారు. గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మర్రిచెట్టులో గణనాథుడు కనిపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆ నోటా.. ఈ నోటా చెట్టులో వినాయకుడు వెలసినట్లు ప్రచారం జరగడంతో సమీప ప్రాంతాల ప్రజలు ప్రత్యేక పూజలు చేసినట్లు ఆ గ్రామాధ్యక్షుడు ఉమ్మిడి వాసు దేవరావు తెలిపారు.

\- కంచరపాలెం